# ఇదీ నా కథ

ఆ రోజు టపాతో పాటు ఒక గవర్నమెంట్ సర్క్యులర్ కూడా వచ్చింది. హిందూ ముస్లిం కలహాలలో పాకిస్తాన్‌కు అపహరింపబడి తిరిగి యీ దేశానికి వచ్చిన స్త్రీల పేర్లు అంతటా వున్నాయి. ఈ సర్క్యులర్ చూడగానే సోహన్‌సింగ్ మిగతా పని మానేసి తదేక దీక్షతో యీ లిస్టు చదవటం మొదలుపెట్టాడు. ఇటువంటి లిస్టులు పూర్వం చాలా వచ్చాయి. ఎప్పటికప్పుడు ఎంతో ఆశతో వాటిని చదవటం, చివరకు నిరాశ పొందటం యిలా సార్లు జరిగింది. ఈరోజు కూడా అలా జరుగుతుందేమోనని అనుక్షణం భయపడుతూనే ఒకొక్క పేజీ చదవటం మొదలుపెట్టాడు. అయిదో పేజీ పూర్తిచేసి ఆరోపేజీలోకి వచ్చేసరికి, ఒక పేరు అతన్ని ముందుకు పోనివ్వలేదు. "తార", తండ్రి అర్జున్‌సింగ్, వయస్సు 20 సంవత్సరాలు, గ్రామం సోనాల్.

తార బ్రతికే ఉన్నదన్నమాట! ఏమైందో ఎల్లా వుందో అని క్షణక్షణం బాధపడ్డ తనని యీనాడు దేముడు చల్లని చూపు చూసాడు. ఈ దేశ విభజనే జరుగకపోతే ఈ అంతఃకలహాలే రాకపోతే తనూ తారా యిప్పుడు ఎంతో హాయిగా కాలం గడుపుతూ వుండేవారు. కాని స్వాతంత్ర్యదేవత కలకత్తా కాళి కంటే కూడా భయంకరమైనది. భక్తుల కోర్కెలను ఆవిడ సులభంగా తీర్చదు. ఎన్నో సిరిసంపదలు బలి యిస్తేనే కాని ఆవిడ ప్రసన్నం కాదు.

చిన్నప్పటి నుంచి తనూ తారా ఎంతో యీడూ జోడూగా వుండేవారు. పెద్దవాళ్ళకు కూడా సమ్మతమే. మంచిరోజు చూసి అంతా తథాస్తు అని కూడా అనుకున్నారు. వివాహానికి తిథి కూడా నిశ్చయమయింది. ఈ వివాహానికి వ్యవధి ఒక నెల రోజులు మాత్రమే. కాని యుగాలు గడిచినా యీనెల పూర్తి కాదని తెలిస్తే వెంటనే వివాహం చేసేశేవారేమో! ఎవరికి తెలుసు?

పది రోజులు గడిచేసరికి రాష్ట్రంలో హిందూ ముస్లిం కలహాలు ప్రారంభ మయ్యాయి. ఎక్కడ చూసినా వినాశనమే! ఒకరోజున సోహన్‌సింగ్ పనిమీద ప్రక్క గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తన గ్రామం లేదు. ఎక్కడికీ మాయం కాలేదు. కాని ప్రాణంతో మాత్రం లేదు. ఊరంతా పరశురామప్రీతి అయిపోతోంది. తను 'తారా, తారా' అంటూ మంటల్లోకి పరుగెత్తబోయాడు. ఎవరో సహృదయులు పట్టుకొని బలవంతంగా ఆపారు.

తారని తురకలు ఎత్తుకుపోయారని వినగానే బాధతో, అవమానంతో ప్రతీకారం కోసమని తన రక్తం బుసలు కొట్టింది. కానీ ఏం చెయ్యడం? ఏం చెయ్యడానికైనా ప్రతీకారం చేయడానికి ఆ పగవాడెవడో తెలిస్తేగా? అంతా నాశనమైన తరువాత యింకా ఆ వూళ్లో దేనికని మిగతా వాళ్లతో కలసి ఢిల్లీకి ప్రయాణమయ్యాడు. ఒకచోట యీ సమూహాలమీద తురకలు దాడిచేసి అందిన డబ్బు, చేజిక్కిన స్త్రీలను పట్టుకొని పరారయ్యారు. వారి నెదిరించి సోహన్‌సింగ్ గాయపడ్డాడు. అష్టకష్టాలుపడి ఢిల్లీ చేరుకొని అక్కడ చికిత్సకోసం ఆసుపత్రిలో చేరాడు. అక్కడి డాక్టరు ఇతని మీద జాలిపడి నయం కాగానే ఒకచోట నౌకరీ ఇప్పించాడు. రెండు సంవత్సరాలు గడచిపోయాయి. పంజాబునుంచి వచ్చిన వాళ్ళు ఎక్కడెక్కడ వున్నా సరే వాళ్లల్లో తార వుందేమోనని ఆశతో వెళ్లేవాడు. నిరాశతో తిరిగి వచ్చేవాడు. ఆ పిల్ల ఏమైందో యింతవరకూ తెలియలేదు.

కాలగర్భంలో కలిసిపోయిందేమోనన్న ప్రియురాలు ఈనాడు తన ఇంటికి తిరిగి వస్తోంది. ఎండిన తన బ్రతుకు తిరిగి చిగురిస్తుంది. తనను చూడగానే తార ఎంతో సంతోషపడుతుంది. ఎన్నో ప్రశ్నలు అడగాలి. ఎన్నో గాధలు వినాలి. వెంటనే బయలుదేరి తార ఉన్న చోటుకు వెళ్లాడు. అక్కడ ఒక ఆఫీసర్ కనిపించాడు. అతనితో తను వచ్చిన పని చెప్పగా,

“ఆ ప్రక్కగదిలోనికి వెళ్ళి కూర్చోండి. ఆవిడని పిలిపిస్తాను. ఆవిడ మీకేమౌతుంది?''

“భార్య.''

ఇతని వంక రెప్పవాల్చకుండా ఒక్క క్షణం చూసి ఆయన “ఐయాం సారీ' ' అని అన్నాడు.

“థ్యాంక్యూ” అని సోహన్‌సింగ్ అన్నాడు.

ప్రక్కగదిలో రెండు మూడు కుర్చీలు తప్ప అంతా ఖాళీగా వుంది. అయిదారు నిమిషాలదాకా ఎవరూ రాలేదు. తరువాత ఎవ్వరో ఆ గదిలోకి వచ్చారు. చూస్తే యెవరో ముప్ఫయి సంవత్సరాలు దాటిన వ్యక్తి లాగు కనిపిస్తోంది. మొహంలో అప్పుడే ముసలితనం తొంగి చూస్తోంది. కొద్ది క్షణాలు ఇద్దరూ మాట్లాడలేదు. చివరకు ఆవిడే 'సోహన్' అంది. అతను అలాగే చూస్తూ ఎలా వూరుకున్నాడు. 'గుర్తుపట్టలేదా?' అని మళ్లీ అడిగింది. ఈసారి అతను ఏం మాట్లాడకపోయే సరికి నిట్టూర్పు విడిచి అక్కడ్నించి వెళ్లిపోబోతోంది. నిద్దరలోంచి ఒక్కసారి మేల్కొన్నట్టు ఉలిక్కిపడి సోహన్ 'తారా' అంటూ కేకపెట్టి ఒక్కంగలో వెళ్లి ఆ పిల్లని తన కౌగిలిలో బంధించివేశాడు.

ఇద్దరి ముఖాల్లో ఎంతో ఆనందం. కానీ కళ్లల్లో ఎంతో దుఃఖం. ఆవిడ ఇతని వంక చూసి 'సోహన్' అని అంటూ ఇంకా ఏదో చెబుదామని అనుకుంది. కానీ చెప్పలేకపోయింది. అతను కూడా ఎన్నో ప్రశ్నలు అడుగుదామని అనుకున్నాడు. కాని దుఃఖం కంఠానికి అడ్డుపడ్డది.

తను చూచి వలచిన వ్యక్తి ఈ వ్యక్తీ ఒకరేనంటే ఎలా నమ్మడం? తనకు తెలిసిన కన్నె అందాల భరిణ, కారణం లేకుండానే క్షణ క్షణం చిరునవ్వు లొలికించే మధుర మూర్తి. కాని ఈ వ్యక్తి బాధలతో బరువులతో చితికిన జీర్ణ కళేబరం. మిగిలిన శిథిల శకలం.

ఆ మధుర దరహాసం, ఆ లావణ్యం ఏమయ్యాయి? స్వాతంత్ర్య దేవతకు అర్పణమయ్యాయా? లేకపోతే గుండెలు లేని కసాయి వాళ్లచేతులలో పడి నాశనమయ్యాయా? ఏం పాపం చేశామని మనకి దండన? ఏం నేరం చేశామని మనకీ శిక్ష? ఈ ఆలోచనల నుంచి మనస్సు మళ్లించి సోహన్ 'ఇంటి కెళదాం రా.'

"నీతో ఒక విషయం చెప్పాలి."

"చెప్పనక్కరలేదు. నాకు అంతా తెలుసు."

"కాదు సోహన్! మీకు తెలియదు. మీకు తెలిస్తే బహుశః నన్ను ఇంటికి రమ్మనవు."

"ఎంత క్రూరమైన మాట అన్నావు?"

"మంచితనమంటే మర్చిపోయాను. అందుకనే నా నోటివెంట మంచి మాటలు రావు."

"ముందర ఇంటికి వెడదాం రా. అక్కడ సావకాశంగా అన్ని విషయాలు చెబుదువుగాని. నేను కూడా చాలా విషయాలు చెప్పాలి."

"చూడు సోహన్! నీతో చెప్పవలసింది చాలా ముఖ్యమైన విషయం. అది ఇక్కడే వినడం మంచిది."

"అయితే చెప్పు."

"నన్ను చూసి నువ్వు గుర్తుపట్టలేకపోయావు."

"అబ్బే! లేదే!"

"అబద్ధం ఆడకు. ఎందుకంటే నువ్వు చూచిన తార ఎప్పుడూ నువ్వు కంటపడగానే సిగ్గుతో తలవంచేది. సంతోషంతో చిరునవ్వు నవ్వేది. నిన్ను చూడగానే ఆ పిల్ల మనస్సులో వెన్నెల విరిసేది. కాని యీనాడు అదే వ్యక్తి మొరటు దేలి,

మొండిబారి ముసలిరూపంతో, హృదయంలేనిదానిగా కనిపించేసరికి విస్మయం చెంది ఈ వ్యక్తినేనా నేను ప్రేమించింది అని ఆశ్చర్యపడుతున్నాను."

"వద్దు తారా! అటువంటి మాటలు."

"నన్ను పూర్తిగా చెప్పనీ. మధ్యలో ఆపకు. పూర్తిగా చెపితేనే కాని యీ గుండెల్లోని మంట చల్లారదు."

"నీకు భార్యగా నీ ప్రక్కన నిలబడాలనే కోరికతో ఆ శుభముహూర్తం కోసం క్షణమొక యుగంగా గడిపిన పిల్ల ఏనాడో అంతమైంది. అదే పేరుతో నీ యెదుట ఈనాడు నిలిచిన వ్యక్తి వేరు. ఇందులో ఎవరు కావాలో కోరుకో!"

"ఆరోజు నువ్వు ఊళ్లో లేవు. తురకలు మన యింటిమీద దాడిచేశారు. నా కళ్ల యెదుటనే నా అన్నలిద్దరూ నా తండ్రీ హతమయ్యారు. అమ్మని ఎటో లాక్కుని వెళ్ళిపోయారు. పెద్ద పెద్ద కేకలు పెడుతున్న నన్ను నోట్లో గుడ్డలు కుక్కి లారీలో ఎక్కడికో తీసుకు పోయారు. అంతా చీకటిమయం. ఎక్కడికి వెళ్లామో, అది ఏ ఊరో నాకు ఈనాటికీ తెలియదు. ఒక పెద్ద యింటిముందు లారీ ఆగింది. నన్ను తీసుకువెళ్ళి ఒక గదిలోపెట్టి బంధించారు. నేను ఏడ్చాను గోల పెట్టాను కాని నామొర వినే దెవరు? ఆనాటి రాత్రి నావెంట వున్న పదిమంది చేతుల్లో నా మానం బలి అయింది. ఎంత బాధ పడ్డానో నా మనస్సు ఎంత క్షోభ పడ్డదో ఆ పరమాత్ముడికే ఎరుక. నన్ను చూస్తే నాకే అసహ్యం వేసింది. ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నా కాని ఎవరో ఒకళ్ళు నాకు కాపలా ఉండేవాళ్ళు. మూడుమాసాలు గడిచాయి. నా పాపం బ్రద్దలయింది. నాకు నెలతప్పింది. అయిదవ నెల రాగానే వాళ్ళు నన్ను ఒక ముసలావిడ చేతిలోపెట్టి మాయమైయ్యారు.

రోజులు త్వరగానే గడిచాయి. ఆ అవ్వ నన్ను వెయ్యికళ్ళతో కనిపెడుతూ వుండేది. నా గర్భంలో పెరుగుతున్న శిశువుని తలుచుకుంటే నాకు ఎంతో ద్వేషం కలిగేది. పుట్టగానే దాన్ని చంపేసేయాలి. ఈబిడ్డ నా బిడ్డ కాదు. ఇది నాకు అక్కర్లేదు. అని అనుకుంటూ వుండేదాన్ని. కాని నా రక్తం పంచుకుని పుట్టిన ఆ పిల్లని చూడగానే ఆ చిన్ని చిన్ని చేతులు, ఎర్రటి పెదిమలు చూడగానే నాలోని మమకారం నన్ను మళ్ళీ మనిషిని చేసింది."

"ఏది ఆ పాప?" అని సోహన్ అడిగాడు.

పాపకు మూడు నెలలు వచ్చేదాకా ముసలావిడ ఏం మాట్లాడలేదు. అది ఆ గూండాలు కలసి నన్ను వ్యభిచారంలోకి దింపారు. ఏడునెలలు యమయాతన పడ్డాను. ఒకరోజున పోలీసులు వచ్చి నన్ను "ఇండియా వెడతావా?" అని అడిగారు.

నాకు సంతోషంతో పిచ్చెక్కింది. ఇండియాకు వచ్చేవాళ్ళతో కలిసి ఇక్కడకు వచ్చాను. ఇదీ నా కథ.... ఈ భ్రష్టురాలిని, కులటను నీయింటికి రమ్మంటావా సోహన్. నీభార్యగా చేసుకుంటావా? వెళ్లు సోహన్. ఎవరైనా కులీనుల పిల్లని పెళ్ళాడి సుఖంగా ఉండు.''

"పాప ఏది?'' అని సోహన్ సింగ్ మళ్ళీ అడిగాడు.

తారప్రక్క గదిలోకివెళ్ళి పసిపిల్లను ఎత్తుకు వచ్చింది. అప్పుడే నిద్దరలేచి మత్తుగా యిటూఅటూ చూస్తోంది. అంత తల్లిపోలిక ఆ పాపవంక ఒక్కక్షణం చూసి, ఒక్క చిరునవ్వునవ్వి, తారవంక చూశాడు.

ఆ ముఖంలో గాంభీర్యం, మొరటుతనం, మొండితనం లేవు. యింతవరకూ కనిపించిన యీ భావాలు ఏమైనాయో, దైన్యం.... నిరాశా ఆ ముఖంలో కన్పిస్తున్నాయి. తన దగ్గరకు రమ్మని పసిపిల్ల వంక చేతులు జాచాడు.

ఇతడు ఆత్మీయుడని ఆ చిన్నారికి తెలుసు కాబోలు. నవ్వుతూ యితని మీదకు వ్రాలింది. ఆ పిల్లను ముద్దుపెట్టుకుని,

"ఇది మనబిడ్డ'' అని అన్నాడు.

"సోహన్'' అంటూ తార అతని పాదాలమీదకు వ్రాలింది.

ఆమెను లేవతీసి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

పాప కిలకిలా నవ్వింది. తార సిగ్గుతో తలవాల్చింది.

ముగ్గురూ యింటికి బయల్దేరారు.

- చుక్కాని *1959*, అక్టోబరు *1*